# సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 26 । మార్చి । 2023






### పెద్దలకు పంచుతున్నారు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలపై ధరలు, పన్నుల భారాన్ని మోపి అదానీ, అంబానీవంటి పెద్దలకు పంచుతోందని సీపీఎం రాష్ట్రకార్య దర్శివర్గ సభ్యుడు వీరయ్య విమర్శించారు. 8లో▸



### రాష్ట్రంలో సుస్థిర పాలన

సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో సుస్థిర పాలన కొనసాగుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్య క్షుడు కోరుకంటి చందర్, పార్టీ ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0/23.0

### వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

పవిత్రమైన రంజాన్ రోజుల్లో శాంతి సందేశం అందించాలి. ప్రపంచ శాంతికి దోహదం చెయ్యాలి.
– మహమ్మద్ ప్రవక్త

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| ఆది: 6:32 | సోమ: 4:51 |

## రంజాన్ వేళలు

## న్యూస్‌రీల్

### పెద్దపల్లిలో జ్యుడిషియల్ సమావేశం



పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రధాన న్యాయస్థానంలో శనివారం జిల్లాస్థాయి జ్యుడిషియల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్‌వీ.శ్రావణ్ హాజరయ్యారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో కేసుల నమోదు, పరిష్కారం తదితర విషయాలపై చర్చించారు. పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానాబాద్, మంథని కోర్టుల నుంచి వచ్చిన సీనియర్, జూనియర్ జడ్జిలు సమావేశంలో పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్షకు 351మంది గైర్హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 351 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 6,216 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 5,865 మంది హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు.

### బీపీమండల్ స్ఫూర్తితో ముందుకు..



నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

మంథని: బీసీల సమాజహితం కోసం బీసీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన బీపీమండల్ స్ఫూర్తితో ముందుకెళ్తామని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. శనివారం బీహార్ రాష్ట్రంలోని పాట్నా అసెంబ్లీ, రాజ్‌భవన్ వద్ద ఏర్పాటు చేసిన బీపీమండల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల్ జన్మస్థలమైన మురో గ్రామాన్ని సందర్శించారు. బీసీల చైతన్యం కోసం మంథని నియోజకవర్గంలో పోరాటం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట బహుజన సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు కె యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్ ఉన్నారు.





# ఇడ్లీవడ.. దోశ!

**Sunday Special**

- మార్నింగ్ టిఫిన్ బయటనే..
- మారుతున్న ఉమ్మడి జిల్లావాసుల అభిరుచి
- పట్టణాల్లో పెరుగుతున్న టిఫిన్ సెంటర్లు
- కరీంనగర్‌లో ఇడ్లీ వడ.. సిరిసిల్లలో పూరి..
- జగిత్యాల, పెద్దపల్లిలో దోశ ఫేవరెట్ ఫుడ్
- మిల్లెట్‌ఫుడ్‌కు పెరుగుతున్న డిమాండ్

'రాజేశ్ కరీంనగర్ నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేస్తుంటాడు. నిత్యం ఉదయం తొమ్మిది గంటలకే విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. 20 కిలోమీటర్ల దూరంలో ఉండే ఇంటి నుంచి ఉదయం ఎనిమిది గంటలకే లంచ్ బాక్స్‌తో సహా వచ్చేస్తాడు. మధ్యాహ్నం వరకు ఆకలికి ఆగడం కష్టమని పాఠశాలకు సమీపంలో ఉన్న ఓ టిఫిన్ సెంటర్‌లో రోజూ అల్పాహారం చేసి వెళ్తుంటాడు. రాజేశ్ ఒక్కడే కాదు.. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 40 వేలకు పైగా మంది పొద్దున్నే టిఫిన్ సెంటర్లలో కడుపు నింపుకుంటున్నారు'.

'కరీంనగర్‌లో నివాసం ఉంటున్న మహేందర్ ఫ్యామిలీతో పొద్దున్నే ఊరెళ్లాలి. దూర ప్రయాణం చేయాల్సి ఉంది. తినేందుకు ఇంట్లో టిఫిన్ తయారు చేయాలంటే ఆలస్యం అవుతుంది. దీంతో ఉదయాన్నే టిఫిన్ సెంటర్‌కు వెళ్లాడు. రెండుమూడు రకాల టిఫిన్లు పార్శిల్ తీసుకున్నాడు. అరగంటలో టిఫిన్ తిని బస్టాండ్‌కు పిల్లలతో సహా బయల్దేరారు. ఒక్క మహేందరే కాదు.. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా రోజూ పది వేల మందికి పైగా టిఫిన్లు హోటళ్ల నుంచి పార్శిల్స్ తీసుకెళ్తున్నారు.'

జీవనయానంలో ఉరుకులు.. పరుగులు సాధారణమైపోయాయి. సమయంతో పోటీపడుతూ.. అంతా రెడీమేడ్ అన్నట్లు తయారైంది. పొద్దున్నే లేవడం.. రెడీ కావడం.. విధులకు బయల్దేరడం.. దారిలో ఇంత టిఫిన్ చేయడం కాలచక్రంలో భాగమైపోయింది. ఈ క్రమంలో టిఫిన్ సెంటర్లకు ఇప్పుడు మంచి డిమాండ్ ఏర్పడింది. టిఫిన్ సెంటర్లకు వెళ్లడం.. నచ్చింది కడుపునిండా తినడం పనులకు వెళ్లడం అలవాటైపోయింది. ఇందులో ఉమ్మడి జిల్లావాసులు భిన్నరుచులు ఇష్టపడుతున్నారు. కరీంనగర్ జిల్లావాసులు ఎక్కువగా ఇడ్లీ-వడ కాంబినేషన్‌ను ఇష్టపడుతుండగా.. రాజన్న సిరిసిల్ల జిల్లావాసులు పూరి ఎక్కువగా తింటున్నారు. ఇక జగిత్యాల.. పెద్దపల్లిలో దోశ అంటే మక్కువని చెబుతున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పొద్దున్నే ఘుమఘుమలాడే అల్పాహార రుచులు.. జిల్లావాసుల అభిరుచులపై సండే స్పెషల్..!! - సాక్షి, కరీంనగర్ డెస్క్

### అడుగుకో టిఫిన్ సెంటర్..

ఇప్పుడు పరిస్థితి కరోనా ముందు.. కరోనా తరువాత అన్నట్లు తయారైంది. కరోనా తరువాత ఆహార సంబంధ వ్యాపారాలు ఉమ్మడి జిల్లాలో చాలా బాగా నడుస్తున్నాయని పలువురు చెబుతున్నారు. గతంలో పట్టణాల్లో వాడకో రెండు టిఫిన్ సెంటర్లు ఉండగా.. ఇప్పుడు కనుచూపుమేరలోనే రెండు మూడు దర్శనమిస్తున్నాయి. చిన్నతోపుడు బండి నుంచి మొదలుపెడితే.. పెద్దపెద్ద అద్దాల భవనాలలోనూ టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఒక్కోచోట ఒక్కో ప్రత్యేకమైన టిఫిన్‌ను తయారు చేస్తూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. టిఫిన్ సెంటర్లను బట్టి రూ.20 నుంచి రూ.70 వరకు ధరలు ఉంటున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో చిన్నాపెద్ద కలిపి 250 వరకు టిఫిన్ సెంటర్లు ఉండగా.. పెద్దపల్లి జిల్లాలో 120, జగిత్యాలలో 180, సిరిసిల్లలో 200కు పైగా ఉన్నట్లు అంచనా. వీటితో పాటు మిల్లెట్ ఇడ్లీలు, మిల్లెట్ దోశలు ప్రస్తుతం పలు టిఫిన్ సెంటర్లలో ప్రత్యేకం.

**జిల్లాలవారీగా 100 మంది చొప్పున పొద్దున ఏయే టిఫిన్లు తింటారని సర్వే చేయగా.. వెల్లడైన అంశాలివి..**

కరీంనగర్ | రాజన్న సిరిసిల్ల | జగిత్యాల జిల్లా.. | పెద్దపల్లి జిల్లా



















### ఉద్యోగులు.. యువతే

పొద్దున్నే బయట టిఫిన్ చేసేవాళ్లలో ఎక్కువగా ప్రయివేటు ఉద్యోగులు, యువతే ఉన్నట్లు తెలుస్తోంది. వీరి తరువాత పట్టణాలకు పని నిమిత్తం వచ్చేవారు.. పట్టణాల్లో నివాసం ఉండేవారు, కాలేజీ యువత ఆసక్తి చూపుతున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కమాన్, మంకమ్మతోట, జగిత్యాల రోడ్డు, మంచిర్యాల చౌరస్తా ప్రాంతాల్లోని టిఫిన్ సెంటర్లలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని పాతబస్టాండు ప్రాంతంతోపాటు విమల్ టాకీస్ ఏరియా, మార్కెట్ ఏరియా, వేములవాడలో గుడి పరిసరాల్లో, జగిత్యాలలో మార్కెట్ ఏరియా, బస్టాండు ప్రాంతంలోని టిఫిన్ సెంటర్లలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పెద్దపల్లిలో జెండాగద్దె, బస్టాండు, గోదావరిఖని ప్రధాన చౌరస్తా ప్రాంతాల్లోని టిఫిన్ సెంటర్లలో రద్దీగా ఉంటుంది.

### నైట్ టిఫిన్ సెంటర్లు



కరీంనగర్ జిల్లాకేంద్రంతో పాటు మిగితా ప్రాంతాల్లోనూ నైట్ టిఫిన్ సెంటర్లు పోటాపోటీగా వెలుస్తున్నాయి. కమాన్, బస్టాండ్, మార్కెట్ ప్రాంతం, జగిత్యాలరోడ్డులో నైట్ టిఫిన్ సెంటర్ల వద్ద రద్దీ కనిపిస్తుంది. హైవేల వెంట మొబైల్ టిఫిన్ సెంటర్లు నోరూరిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం అందుబాటులో ఉంటున్నాయి.

### ఇడ్లీవడ ఎక్కువగా..



నేను ఆటో డ్రైవర్‌ను. పొద్దున ఏడు గంటలకే ఇంట్లోంచి బయటికి వెళ్తా. అప్పటికి ఇంట్లో ఏం టిఫిన్ సిద్ధం చేయరు. దీంతో మా అడ్డాకి సమీపంలో కానీ.. అందుబాటులో ఉన్నచోట రోజూ టిఫిన్ చేస్తా. వారంలో మూడు, నాలుగు సార్లు ఇడ్లీవడ కాంబినేషన్ తింటా. అది తింటే త్వరగా జీర్ణమవుతుందని నా అభిప్రాయం.
– రాజు, ఆటో డ్రైవర్, కరీంనగర్

### ఆరోగ్యం ముఖ్యం



ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ప్రస్తుతం ఏదైనా కల్తీగా మారుతోంది. నేను అడ్వోకేట్‌ను. పొద్దున లేస్తే చాలా బిజీగా ఉంటాను. అలా అని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయను. ఇదివరకు సాధారణ టిఫిన్లు తినేవాన్ని. ఇప్పుడు పెద్దపల్లిలో మిల్లెట్ టిఫిన్స్ అందుబాటులోకి వచ్చాయి. దీంతో నేను ప్రతీరోజు మిల్లెట్ ఇడ్లీ లేకుంటే మిల్లెట్ దోశ తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నా.
– వీ.ఎస్.మూర్తి, అడ్వోకేట్, పెద్దపల్లి

### 20 ఏళ్ల నుంచి ఈ వ్యాపారమే..



సిరిసిల్లలో 20 ఏళ్ల నుంచి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నా. మా ఫ్యామిలీతో పాటు 20మందికి ఉపాధి కల్పిస్తున్నా. మా హోటల్‌లో పరోటా ఫేమస్. రోజూ బాగానే గిరాకీ ఉంటుంది. ఇతర ప్రాంతాల వారు కూడా సిరిసిల్లకు వచ్చినప్పుడు ఇక్కడే తింటారు.
– శ్రీనివాస్, టిఫిన్‌సెంటర్ యజమాని, సిరిసిల్ల

### ఉదయం, సాయంత్రం గిరాకీ



కరీంనగర్‌లో మాది పేరున్న టిఫిన్ సెంటర్. ఉదయం సాయంత్రం రద్దీ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం 12 వరకు, మళ్లీ 3గంటల నుంచి రాత్రి 11 గంటలవరకు గిరాకీ ఉంటుంది. ఉదయం ఊతప్ప, సాయంత్రం దోశ మా టిఫిన్ సెంటర్ ప్రత్యేకం. – ప్రసాద్, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు, కరీంనగర్

# మహిళకు ఆరోగ్య భాగ్యమే..!

- వ్యాధుల గుర్తింపు.. చికిత్సకు కార్యాచరణ
- ప్రతి మంగళవారం ప్రత్యేక సేవలు
- ఉమ్మడి జిల్లాలో 15 ఆసుపత్రులు
- ఆరోగ్య మహిళకు భారీ స్పందన



కరీంనగర్‌లో ఆరోగ్య మహిళా సెంటర్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆరోగ్య మహిళ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 100 ఆస్పత్రులను ప్రారంభించింది. ప్రతి మంగళవారం ప్రత్యేకంగా క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎనీమియా, క్యాన్సర్ నిర్ధారణ, పౌష్టికాహార లోపాన్ని గుర్తించడం, మూత్రాశయ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, మెనోపాజ్ సమస్యలు, లైంగిక సంబంధ వ్యాధులు, గర్భాశయ కణతులు, ఆర్థో, బరువుకు సంబంధించిన ఇబ్బందులు ఒక్కో నెలలో ఒక్కో సమస్యపై కార్యక్రమం తీసుకుని వైద్య సేవలు అందిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 15 ఆసుపత్రులు**

ఆరోగ్య మహిళ నిర్వహణ కోసం ఉమ్మడి జిల్లాలో 15 ఆసుపత్రులను ఎంపిక చేసి సేవలు కొనసాగిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో 3 ఆసుపత్రులు.. నగరంలోని బుట్టిరాజారాం కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం, చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4 ఆసుపత్రులు.. ఇందులో పట్టణంలోని సుందరయ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, వేములవాడ, తంగళ్లపల్లి, నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జగిత్యాల జిల్లాలో 5 ఆసుపత్రులు.. ఇందులో పట్టణంలోని జీఎస్ రాంవెల్ పట్టణ ఆరోగ్య కేంద్రం, కొడిమ్యాల, నేరెళ్ల, అయిలాపూర్, కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పెద్దపల్లి జిల్లాలో 3 ఆసుపత్రులు.. ఇందులో పెద్దపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రామగుండం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మంథనిలో గద్దెలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆరోగ్య మహిళ ఆసుపత్రులుగా మార్చారు. మిగతా సేవలకు ఇబ్బంది కలగకుండా ప్రతి మంగళవారం మాత్రం కేవలం మహిళల కోసమే ఆసుపత్రులను నిర్వహిస్తున్నారు.

**మేజర్ సమస్య ఉంటే పెద్దాసుపత్రికి..**

మహిళలకు సాధారణ సమస్యలు ఉంటే ఆరోగ్య కేంద్రంలోనే చికిత్స అందిస్తున్న వైద్యులు, మేజర్ ఆరోగ్య సమస్యలు ఉంటే పెద్దాసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. క్యాన్సర్, గర్భాశయ సమస్యలు నిర్ధారణ అయిన వారిని సంబంధిత ఆసుపత్రులకు పంపించి చికిత్స అందేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఈనెల 8 నుంచి ఇప్పటివరకు 3 మంగళవారాలు ఎంపిక చేసిన ఆసుపత్రులలో వైద్య సేవలు అందించారు. ఆరోగ్య మహిళకు ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాలోని 15 ఆసుపత్రులలో ఇప్పటివరకు 1280 మందికి ఓపీ సేవలు అందించారు.

ఉమ్మడి జిల్లాలో ఆరోగ్య మహిళ వివరాలు...

| | కరీంనగర్ | సిరిసిల్ల | జగిత్యాల | పెద్దపల్లి |
|---|---|---|---|---|
| ఆసుపత్రులు | 03 | 04 | 05 | 03 |
| చూసిన ఓపీ | 414 | 201 | 501 | 164 |
| చేసిన పరీక్షలు | 260 | 60 | 253 | 47 |

### దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ



మౌనదీక్ష చేస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో గాంధీ విగ్రహం వద్ద మౌనదీక్ష చేపట్టారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని ఖండించారు. పార్లమెంటరీ వ్యవస్థకు చీకటి రోజు అని పేర్కొన్నారు. గాంధీ కుటుంబంపై బురదజల్లడమే ప్రధాన అజెండాగా మోదీ పనిచేస్తున్నారని విమర్శించారు. బొంతల రాజేశ్, గట్ల రమేశ్, కాల్వ లింగస్వామి, మాదరబోయిన రవికుమార్, కార్పొరేటర్ ఎండి ముస్తఫా, పెద్దెల్లి ప్రకాశ్, తాళ్లపల్లి యుగంధర్, వీరబోయిన రవియాదవ్, సుతారి లక్ష్మణ్‌బాబు, బొమ్మక రాజేష్, గడ్డం శేఖర్, ఎండీ.యాకూబ్ పాల్గొన్నారు.

**కార్మికుల పోరాటం మరువలేనిది**

తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పోరాటం మరువలేనిదని రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. హాథ్ సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా జీడీకే-1 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఎంఎండీఆర్ యాక్ట్ 2015 ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై సింగరేణిని ప్రైవేటు పరం చేయాలని కుట్ర పన్నుతున్నాయని పేర్కొన్నారు. పదవి ఉన్నా.. లేకున్నా ప్రజలకు సహాయం అందిస్తున్నానని, ఒక్కసారి అవకాశం ఇస్తే అధికారికంగా ప్రజాసేవ చేస్తానని వెల్లడించారు. అంతకుముందు జనగామలో హాథ్‌సేహాథ్ చేపట్టారు.

# ఆదర్శంగా నిలుస్తున్న 'పల్లె ప్రగతి'

- అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం భేష్
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఉత్తమ పంచాయతీ సర్పంచులకు సత్కారం
- పాల్గొన్న కలెక్టర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



ఉత్తమ పంచాయతీ సర్పంచులను సత్కరిస్తున్న మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలోని పల్లెలు సాధించిన ప్రగతి దేశానికి ఆదర్శమని, పంచాయతీలకు జాతీయ అవార్డులు అందుతుండడమే ఇందుకు నిదర్శనమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ సతత్ పంచాయతీ పురస్కారం కింద తొమ్మిది అంశాల్లో అవార్డులకు ఎంపికైన జిల్లాలోని 27 పంచాయతీల సర్పంచులకు మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కలెక్టర్ సంగీత అవార్డులు ప్రదానం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పల్లెల స్వరూపాన్ని మార్చుతున్నాయని, ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం ఎంతో ఉందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. జాతీయస్థాయిలో పోటీపడి 9 అంశాల్లో 27 పంచాయతీలు ప్రతిభ చూపడం ఆనందంగా ఉందని కలెక్టర్ అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, మహిళా కమిషన్ సభ్యురాలు రేవతిరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, జెడ్పీ వైస్ చైర్మన్ మండిగ రేణుక, ఎంపీడీఓ, ఎంపీఓ, సర్పంచు, జెడ్పీటీసీ తదితరులున్నారు.

**సీపీఆర్‌పై విస్తృత ప్రచారం చేద్దాం**

గుండెపోటు మరణాలు కలవరపెడుతున్నాయని, వాటిని నియంత్రించే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)పై విస్తృత ప్రచారం చేయాలని మంత్రి తెలిపారు. కలెక్టరేట్‌లో సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెల్త్‌వర్కర్స్, స్వశక్తి మహిళలు, పోలీసులు, షాపింగ్‌మాల్స్, అపార్ట్‌మెంట్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు తదితర వర్గాలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించేలా ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ తెలిపారు.

**రామగిరిలో మూడు పంచాయతీలు**

రామగిరి: దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాన్ని మండలంలోని రత్నాపూర్, నాగేపల్లి, ముత్తారం మండలం ఓడేడ్ పంచాయతీ సర్పంచులు పల్లె ప్రతిమ, కొండవేన ఓదెలుయాదవ్, సిరికొండ బక్కారావు అందుకున్నారు. అలాగే కమాన్‌పూర్ మండలం జూలపల్లి సర్పంచ్ శంకర్ గౌడ్ పురస్కారం అందుకున్నారు.

**గురుకులాలు నిరుపేదలకు వరం**

ధర్మారం: గురుకులం విద్యాలయాలు పేదవిద్యార్థులకు వరంలా మారాయని మంత్రి ఈశ్వర్ అన్నారు. మండలంలోని కానంపెల్లిలో సీసీ రోడ్లు, నందిమేడారంలోని బాలుర గురుకులంలో అదనపు తరగతి గదులను ప్రారంభించారు. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని, నాణ్యమైన విద్య అందుతోందని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిన ఇదే గురుకులం విద్యార్థి రాజ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించి మెమొంటో అందించారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రిన్సిపాల్ మాధవీలత, ఎంపీడీవో జయశీల, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**వృద్ధాశ్రమం నిర్మించడం పుణ్యకార్యం**

ఫెర్టిలైజర్‌సిటీ: వృద్ధాశ్రమాన్ని నిర్మించడం పుణ్యకార్యమని మంత్రి అన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధి వీర్లపల్లిలో నిర్మించిన ఈశ్వరకృప వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి మాట్లాడుతూ పాశ్చాత్య పోకడలతో తల్లిదండ్రుల పట్ల పిల్లలకు ప్రేమలు, అభిమానాలు తక్కువవుతున్నాయని, ఆ పరిస్థితుల్లో ఆశ్రమాలకు వెళ్లాలనే ఆలోచన వృద్ధుల్లో కలుగుతోందన్నారు. జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్, నగర మేయర్ బంగి అనిల్ కుమార్, సీపీ రెమారాజేశ్వరి, డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీ గిరిప్రసాద్, ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఎస్‌కె.ఝా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ఉప్పరపల్లె, బీమరిపల్లె సర్పంచులకు సన్మానం**

ఓదెల: మండలంలోని ఉప్పరపల్లె, బీమరిపల్లె సర్పంచులు పల్లె ఓదెలు, కల్లెపల్లి సరితను మంత్రి ఘనంగా సన్మానించారు. ధర్మారం మండలం కటికెనపల్లి సర్పంచు కారుపాకల రాజయ్యను మంత్రి ఈశ్వర్ సన్మానించారు.

## క్లుప్తంగా

### శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ పున:ప్రతిష్ఠ ప్రారంభం



పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ సునీత

సుల్తానాబాద్: పట్టణంలోని గుడిమిట్టపల్లిలో పురాతన శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయ పున:ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. మొదట పార్వతీ పరమేశ్వరుల దేవస్థానం ఇక్కడేనని పలువురు చెబుతుంటారు. నేటికీ నాగసర్పం స్వామివారిని ఆరాధించడం భక్తులందరికీ తెలుసు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, ఆలయ కమిటీ చైర్మన్ నగునూరి అశోక్ కుమార్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాదూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రం

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నాయకులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. రాహుల్‌గాంధీపై లోక్‌సభ తీసుకున్న చర్య భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సౌభ్రాతత్వం, సమానత్వం, లౌకిక వాద రక్షణ కోసం ఆయన చేసిన భారత్ జోడో యాత్ర కాంగ్రెస్ ఇమేజ్‌ను అమాంతం పెంచిందన్నారు. రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే మోదీ సర్కారు రాహుల్ గాంధీపై ఇలాంటి చర్య తీసుకుందని విమర్శించారు. నాయకులు గుమ్మడి కుమారస్వామి, నర్సింహారెడ్డి, ధర్మపురి, వికాస్, సదానందం, దాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



బాలరాజు (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): అనారోగ్య కారణాలతో ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్న శాతరాజు బాలరాజు(95) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ధర్మారం మండలంలోని దొంగతుర్తికి చెందిన బాలరాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, శుక్రవారం తన కుమారుడు వెంకటస్వామి ఇంటికి వెళ్లి, ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# పేదలను కొట్టి పెద్దలకు పంచుతున్నారు



బైక్ ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు



బతుకమ్మలతో భారీ ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు

- బీజేపీ పాలనా విధానాన్ని ఎండగట్టేందుకే బస్సుయాత్ర
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలపై ధరలు, పన్నుల భారాన్ని మోపి అదానీ, అంబానీవంటి పెద్దలకు పంచుతోందని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య విమర్శించారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర శనివారం పెద్దపల్లికి చేరింది. జన చైతన్య యాత్ర బృందం నాయకుడు వీరయ్య మాట్లాడుతూ వంటనూనె, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఇష్టానుసారంగా పెంచారని, వాటిని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్లు పెట్టి బలోపేతం చేసిన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు అమ్మేస్తున్నారని తెలిపారు. మోదీకి ఆప్తుడైన అదానీ బీజేపీ అండతో లూటీ చేశారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని మరింతగా విస్తృత పర్చాలని ప్రజలంతా కోరుతుంటే ఆ పథకాన్ని ఎత్తేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. నాయకులు భూపాల్, జయలక్ష్మి, స్కైలాబ్‌బాబు, జగదీశ్, బాలకృష్ణ, శోభన్, ఆశయ, యాకయ్య, ముత్యంరావు, రవీందర్, అశోక్, దిలీప్, ప్రశాంత్, శ్రావణ్, నవీన్, శ్రీనివాసరెడ్డి, వెంకటస్వామి తదితరులున్నారు.

**ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడదాం**

గోదావరిఖని(రామగుండం): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొడదామని ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. శనివారం సీపీఎం జనచైతన్య యాత్ర గోదావరిఖనికి చేరుకుంది. స్థానిక ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ కార్పొరేట్ శక్తులకు పెంచి పోషిస్తోందన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సొంతింటి నిర్మాణానికి సహకరిస్తామని చెప్పి మర్చిపోయిందన్నారు. రానున్న కాలంలో బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు జగదీష్, భిక్షమయ్య, భూపాల్, ఎర్రవెల్లి ముత్యంరావు, మహేశ్వరి, రమాచారి, కుమారస్వామి, తుమ్మల రాజారెడ్డి, జ్యోతి, మెండె శ్రీనివాస్, ఉల్లి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

### జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

- ఓబీ కంపెనీ ఇన్‌చార్జి వేధింపులు, ఓ మహిళ కారణమని సూసైడ్ నోట్



మధుసూదన్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన ఇందూరి మధుసూదన్(39)కు 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. మంచిర్యాల జిల్లా ఎస్ఆర్‌పీ ఉపరితల గనిలో ప్రైవేట్ డ్రైవర్‌గా విధులు నిర్వస్తున్నాడు. కుటుంబ కలహాలతో రెండేళ్లుగా దూరంగా ఉంటున్నాడు. ఓబీ కంపెనీ క్యాంపులోనే ఉంటూ విధులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, శనివారం గోదావరి నది ఒడ్డున సమ్మక్క గద్దెల వద్దకు వచ్చి, షెడ్డులో ఉరేసుకున్నాడు. తన ఆత్మహత్యకు తాను పనిచేస్తున్న ఓబీ కంపెనీ ఇన్‌చార్జి సతీశ్ వేధింపులతోపాటు ఓ మహిళ కారణమని సూసైడ్ నోట్ రాశాడు. మృతుడి సోదరుడు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. కాగా మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు..?

- మోసం చేయడమే కాంగ్రెస్, బీజేపీలకు ఆనవాయితీ
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: కొందరు నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయకుండా ఇప్పుడు సానుభూతి కోసం.. ఎమ్మెల్యే కుర్చీ కోసం ప్రజల వద్దకు వస్తున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అబద్ధాలు ఆడడం, మోసం చేయడం కాంగ్రెస్, బీజేపీకి ఆనవాయితీగా మారిందన్నారు. వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.10వేల పరిహారం అందించనున్నట్లు వివరించారు. రైతుబంధు జిల్లా అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి, ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్ రావు, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఫక్కీర్ యాదవ్, గుడుగుల సతీష్, రాజమౌళి, చంద్రమొగిళి, లావణ్య, సారయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు**

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని లాలపల్లికి చెందిన కుర్మ సంఘం నాయకులు, యువకులు 50మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. కురుమ సంఘం అధ్యక్షుడు చిగుర్ల జగ్గయ్య, మాజీ అధ్యక్షుడు చిగుర్ల రాములు, తిరుపతి, రాయుడు, లింగయ్య, రాజమల్లు, అయిలయ్య తదితరులు ఉన్నారు. ఎంపీపీ తానిపర్తి స్రవంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, లాలపల్లి సీనియర్ నాయకులు కల్లెం శ్రీనివాసరెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి రాజేశం, పెద్ది రాజేశ్వర్ పాల్గొన్నారు.

**కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి**

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ ఆలోచనావిధానం, పాలనతోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని, ప్రజలంతా కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే దాసరి, చిరుమల్ల రాకేశ్ అన్నారు. బందంపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. నాయకులు మర్కు లక్ష్మణ్, బండారి రామ్మూర్తి, దాసరి చంద్రారెడ్డి, నర్సింహారెడ్డి, ఇనుగాల అనంతరెడ్డి, మేకల లక్ష్మణ్ తదితరులున్నారు.

# సింగరేణి కార్మికుల మారుపేర్లు మార్చండి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికుల మారుపేర్లు మార్చాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం కార్మికులు ఆయనకు వినతి పత్రం అందజేసిన సందర్భంగా మాట్లాడారు. సింగరేణి సంస్థలో మారుపేర్లతో పని చేస్తున్న కార్మికుల పేర్లు మారుస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. గత సమావేశంలో జరిగిన ఒప్పందం మేరకు మారుపేర్ల మార్పుపై యాజమాన్యం చర్యలు తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, తాట్ల లక్ష్మయ్య, పల్లె శ్రీనివాస్, పోరండ్ల వెంకటేశం, చీకట్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# సీహెచ్‌పీ ఆధునీకరణపై వీడియో కాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 సీహెచ్‌పీ ఆధునీకరణపై సింగరేణి డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ సంబంధిత నిర్మాణ సంస్థతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఈఎస్ఎల్, ఎఫ్ఎఫ్ఐఎల్ కంపెనీల భాగస్వామ్యంతో ఆధునీకరణ కొనసాగిస్తున్న నేపథ్యంలో పూర్తి అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, సీహెచ్‌పీల జీఎం స్వామినాయుడు, ప్రాజెక్టు అధికారి మోహన్‌రెడ్డి, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, సివిల్ డీజీఎం ధనుంజయ్, సీహెచ్‌పీ ఎస్ఈ సదానందం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సుస్థిర పాలన

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



ర్యాలీలో ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో సుస్థిర పాలన కొనసాగుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, పార్టీ ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక తిలక్‌నగర్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా రమేశ్‌నగర్ చౌరస్తా నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రహదారులు తొలగించి నూతన రహదారులు వేశామన్నారు. మెడికల్ కళాశాల మంజూరు చేయించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి నిండుకుండలా తయారైందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిని ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కేంద్రం గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి సామాన్యప్రజల నడ్డి విరుస్తోందన్నారు. నాయకులు చిరుమిల్ల రాకేశ్, కార్పొరేటర్లు పెంట రాజేష్, కొమ్ము వేణు, పాముకుంట్ల భాస్కర్, దాతు శ్రీనివాస్, నాయకులు మూల విజయారెడ్డి, పర్లపల్లి రవి, నారాయణదాసు మారుతి, తోడేటి శంకర్ గౌడ్, అడప శ్రీనివాస్, మెతుకు దేవరాజ్, నడిపెల్లి మురళీధర్‌రావు, జేవీరాజు, అదర్‌సండే సమారావు, సిరాజుద్దీన్, ప్యారేమియా తదితరులు పాల్గొన్నారు.

**కార్మికులంతా బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి**

టీబీజీకేఎస్ శ్రేణులంతా బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి కమ్యూనిటీ హాల్‌లో ఆర్జీ–2 ఏరియా టీబీజీకేఎస్ ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ఆపదలో ఆదుకున్న నాయకులను గుర్తించి రానున్న ఎన్నికల్లో గెలిపించాలని సూచించారు. టీబీజీకేఎస్ అధ్యక్షులు బి.వెంకట్రావ్, వర్కింగ్ ప్రసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నాయకులు ఐలి శ్రీనివాస్, బదావత్ శంకర్‌నాయక్, నాచగోని దశరథంగౌడ్, కర్క శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రామగిరి(మంథని): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ జారీ చేయడాన్ని నిరసిస్తూ శనివారం ముత్తారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వారితో మాట్లాడటంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బియ్యాని శివకుమార్, ఉపాధ్యక్షుడు గాదం శ్రీనివాస్, నాయకులు సమ్మయ్య, దాసరి చంద్రమౌళి, నెత్తెట్ల మల్లయ్య, రత్న నాగరాజు, మేదరి శేఖర్, కోల విజయ్, చేల్కల జితేందర్, గుడి రాములు, బియ్యని రాజబాబు పాల్గొన్నారు.

# బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–1 ఏరియా సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్‌గా చిలుక శ్రీనివాస్ ఎన్నికయ్యారు. శనివారం గోదావరిఖనిలోని ఆర్‌సీవోఏ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, నూతన కమిటీని ప్రకటించారు. ఏరియా అధ్యక్షుడిగా డాక్టర్ మధుకుమార్, ఉపాధ్యక్షులుగా సారంగపాణి, వసంతకుమార్, కోశాధికారిగా దేవాచారి ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. బీసీలు సంఘటితంగా పోరాడి, ఉద్యోగ హక్కులు, ఉద్యోగ భద్రత, ప్రమోషన్ పాలసీ సాధించాలని సూచించారు. బీసీలకు న్యాయం జరిగేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని చెప్పారు.

# ఆర్జీ–2లో క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–2 ఏరియాలో క్వార్టర్ల కేటాయింపునకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియా సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 615 క్వార్టర్లకు గాను 146 మంది దరఖాస్తు చేసుకోగా 60 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో అర్హులైన 50 మందికి సీనియారిటీ ప్రకారం క్వార్టర్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎస్వోటూ జీఎం సలీం, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, జేఈ సివిల్ రాధాకృష్ణ, సీనియర్ పీవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

# వైఎస్ హయాంలో ఏకకాలంలోనే రుణమాఫీ

- బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయమే..
- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో ఏకకాలంలోనే రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం దేవునిపల్లి, బొంపల్లి గ్రామాల్లో శనివారం గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని చేపట్టారు. పాదయాత్రన పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రైతులకు మేలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం కేసీఆర్ పాలనంతా అవినీతి, అక్రమాలేనన్నారు. సహజ సంపదను దోచుకోవడమే కాకుండా పేదలు, వ్యాపారులపై అడ్డగోలు పన్నుల భారం మోపారని ఆరోపించారు. రైతులకు పంట రుణాలను దశలవారీగా మాఫీ చేస్తానని చెప్పిన ప్రభుత్వం.. ఇపుడు రైతుకు బ్యాంకులో అప్పు పుట్టకుండా చేసిందన్నారు. రైతుబంధు కూడా అందరికీ అందడంలేదన్నారు. కాంగ్రెస్‌కు అవకాశమిస్తేనే రైతులకు మేలు కలుగుతుందని అన్నారు. నాయకులు శ్రీనివాస్, ఎడెల్లి శంకర్, బొక్కల సంతోష్, సతీశ్, అశోక్, రాజు, గుర్రాల రాజు, రవీందర్, అవినాష్, సంతోష్, తిరుపతిరావు, తూముల మహేశ్, గట్టయ్య, కనకయ్య తదితరులున్నారు.

# సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న వెంకన్న

రామగిరి(మంథని): సింగరేణి సంస్థలో పని చేస్తున్న బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించేలా టెండర్ పిలవాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించి, మాట్లాడారు. సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లిస్తామని యాజమాన్యం అంగీకరిస్తేనే టెండర్ వేయాలని ఆర్జీ–3 కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌కు విన్నవించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, బెల్ట్ క్లీనింగ్ టెండర్ మార్చాలని కోరారు. కార్యక్రమంలో బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

### 30న అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న దళిత సంఘాల ప్రతినిధులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణకు సంబంధిత కమిటీని ఈ నెల 30న ఏర్పాటు చేస్తున్నట్లు దళిత సంఘాల ప్రతినిధులు తెలిపారు. శనివారం సుల్తానాబాద్ పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 30న ఉదయం 10 గంటలకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసే సమావేశానికి సుల్తానాబాద్ పట్టణంతోపాటు అన్ని గ్రామాల ప్రజలు, పార్టీల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు శీలం శంకర్, నా యకులు న్యాతరి శ్రీనివాస్, తిప్పారపు ద యాకర్, న్యాతరి ప్రభాకర్, చుక్క రాజమౌళి, క్యాదాసి చంద్రమౌళి పాల్గొన్నారు.

### అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

జ్యోతినగర్(రామగుండం): ఓ వివాహితను అదనపు వరకట్నం కోసం వేధించిన ఆమె అత్తింటివారిపై ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండం కార్పొరేషన్ న్యూపీకే రామయ్యకాలనీకి చెందిన లలితకు ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందిన దేదావత్ శ్రీనివాస్‌తో 2021లో వివాహమైంది. అప్పటినుంచి భర్తతో పాటు అత్తామామ అదనపు కట్నం కోసం ఆమెను వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు శనివారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.